విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 45 | 23-08-2021 | పుటలు : 4


## ప్రపంచ జానపద దినోత్సవం

ఆగస్టు 22



శుభాకాంక్షలతో..

- నన్నయవాణి




## రక్షాబంధన్ శుభకామనలు!!

"యేన బద్ధో బలీరాజా దానవేంద్రో మహాబలః।
తేన త్వామభి బధ్నామి రక్షమాచల మాచల॥"

శ్రీ మహావిష్ణువు శక్తిచే మహాబలుడు అయిన బలిచక్రవర్తిని బంధించినట్లుగా ఓ రక్షాబంధనమా! నీవు చలించక వీనికి రక్షణ కల్పించుము.. అని అర్థం.

- నన్నయవాణి

శ్రావణ పూర్ణిమ
ప్రపంచ సంస్కృత దినోత్సవం!
'స్వదత సంస్కృతమ్'
విశ్వజనీనం...సంస్కృతవాణి




" ఆనోభద్రా: క్రతవోయన్తు విశ్వతః "

(Let the Noble thoughts come to us from all sides)

ఉదాత్తమైన ఆలోచనలు మనకు
అన్ని వైపుల నుండి లభించుగాక!

జయతు సంస్కృతమ్..

- నన్నయవాణి

# సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలి


### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**21.08.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో గురువారం విశ్వవిద్యాలయ అధికారులు మరియు అధ్యాపకేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల్లోని 430 అనుబంధ కళాశాలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంతో ఎక్కువ బాధ్యతను నిర్వహిస్తుందని అన్నారు. కాబట్టి విశ్వవిద్యాలయ సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని చెప్పారు. కళాశాలలకు, విద్యార్థులకు సమర్థవంతమైన సేవలు అందించే విధంగా సిబ్బంది మెలగాలన్నారు. క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ ప్రతిష్టను పెంచే విధంగా పారదర్శకంగా పని చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలోని సిబ్బంది స్నేహపూర్వకంగా, ఉన్నత ఆలోచనలతో విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సిబ్బంది అంతా పూర్తి స్థాయిలో విశ్వవిద్యాలయ ప్రగతికి కృషి చేయాలని, తద్వారా సిబ్బందికి మేలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు.

# ఆన్‌లైన్ అడ్మిషన్ల్‌పై ఉన్నత విద్యామండలి సమీక్ష




ఆన్ లైన్ అడ్మిషన్ల నిర్వహణపై ఉన్నత విద్యా మండలి సమీక్షిస్తున్న దృశ్యం

**21.08.21 (మీడియాసెల్)** ఆన్లైన్ అడ్మిషన్ల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి గురువారం ఆన్లైన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆన్ లైన్ అడ్మిషన్ల నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ఈ సమావేశంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సతీష్ చంద్ర ఐ.ఎ.ఎస్., ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి, రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు, అధికారులు హాజరయ్యారు. సమీక్షలో చర్చించిన పలు అంశాలను వీసీ జగన్నాథరావు తెలియజేశారు. గత ఏడాది జరిగిన డిగ్రీ ఆన్ లైన్ అడ్మిషన్ల నిర్వహణపై చర్చించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పీజీ ఆన్లైన్ అడ్మిషన్లకు సంబంధించి కేటగిరిల వారీగా ఫీజుల నిర్ధారణపై చర్చించారన్నారు. ఆన్లైన్ అడ్మిషన్లకు సంబంధించిన జిల్లాకు ఒకటి చొప్పున సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఎయిడెడ్ కళాశాలలకు సంబంధించిన పలు అంశాలను చర్చించారన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ప్రవేశాలు, ద్రావిడ విశ్వవిద్యాలయ కార్యక్రమాలలో ప్రవేశాలు, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ లలో ప్రవేశాలు, ఆన్ లైన్ అడ్మిషన్ల నిర్వహణ ప్రణాళిక వంటి అన్ని అంశాలను చర్చించారని తెలియజేశారు.

## సంపాదకీయం



# జానపద దినోత్సవం

విలియం జె.థామ్స్ అనే ఆంగ్లేయుడు మొట్టమొదటిగా "ఫోక్ లోర్" అనే పదాన్ని సృష్టించాడు. 1846 ఆగస్టు 22 న నాటి 'ది అథనీయం' అనే పత్రికకు రాసిన వ్యాసంలో ఈ ఫోక్ లోర్ పదబంధాన్ని సూచించాడు. ఆగస్టు 22 ప్రపంచ జానపద దినోత్సవానికి గల నేపథ్యమది. థామ్స్ ఈ పదబంధాన్ని సృష్టించిన ఐదేళ్లకి థామస్ స్టైన్ బర్గ్ ప్రప్రథమంగా ఆ పదబంధాన్ని ఒక గ్రంథానికి పేరుగా సూచించాడు.

జనపదం అంటే పల్లెటూరు. నాగరక శబ్దానికి భిన్నంగా వాడుతున్న శబ్దం జానపదం. జానపదంలో నివసించే వారి మధ్య పుట్టి వారి మానసిక భావనా స్వరూపాన్ని, సుఖదుఃఖాలను యధాతథంగా ఆవిష్కరించేది జానపద వాఙ్మయం. జానపదులు పాడుకునే పాటల్ని, గేయాల్ని జానపద గేయాలంటాం. ఫోక్ సాంగ్స్. జానపద సాహిత్యాన్ని ఫోక్ లిటరేచర్ అని, జానపద విజ్ఞానాన్ని ఫోక్ లోర్ అని వ్యవహరిస్తున్నాం.

చేసే పని తూగుకు, ఆడే ప్రతి ఆట విశ్వాసానికి, ఊపే ప్రతి ఊయల ఊపునకు, ఊరడించే ప్రతి తల్లి గొంతు ఒరవడికి, ఊరడిల్లే ప్రతి శిశువు కేరింతకు,ఊకొట్టే మనవడి హృదయ స్పందనకు, రూపు గొల్పే అమ్మమ్మ తాతయ్యల కథాకథన సంవిధానానికి అనుగుణమైన ఆయా లయల హొయలులో ఒదిగిన పదబంధ విన్యాసమే జానపద సాహిత్యం.

"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గాన రసం ఫణి:" అనే ఆర్యోక్తి జానపద గేయ విషయంలో ప్రత్యక్షర సత్యం. శ్రామికులైనా, కార్మికులైనా, శిశువైనా, పశువుల కాపరైనా, చెమ్మచెక్కలాడే బాలికలైనా, కోలాట బృందమైనా, జానపద గేయాన్ని పాడుకుంటూ బ్రహ్మానంద సదృశమైన రసానందానికి లోనవుతారు. శ్రమనుంచి శ్రామికుడు ఊరట పడితే, కను కొనల నుంచి జలజల జారే కన్నీటి నుంచి విముక్తుడై ఆనందాతిశయంతో కేరింతలు కొడతాడు పసి బాలుడు.జానపద గేయం – అది శృంగార రసవంతమైనా, కరుణ రసాత్మక కథనమైనా, వినోదాత్మక సమంచితమైన సహృదయ జానపదుని మనసున వెల్లివిరిసిన కవితారస పేశలం. బ్రహ్మానంద సబ్రహ్మచారి. సంగీతసాహిత్యాల సమాశ్రయ సమాహార స్వరూపం జానపద గేయం. కథా సంవిధాన సంయుతమై ఆనందాన్ని పురిగొల్పే రసమయంగా జానపద గేయం ప్రశస్తినందింది.

మందులోడా ఓరి మాయలోడా!, అత్తరు సాయిబో రారా, అందాల మామయ్యో రారా!, గుంటూరు చిన్నదాన గూడూరు చిన్నదాన!, మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో మంచెకాడ కలుసుకో మరువకు మామయ్య!.... వంటి పాటలు చిన్న చిన్నవే అయినా సహృదయ రసార్ద్ర హృదయుడైన జానపదునకు, సాధారణ శ్రోతలకు శ్రోతృపేయమై,రస తుందిలమై, ఆనంద పరవశమై ఒక్క మాటలో చెప్పాలంటే రసఘుటికగా జానపదగేయం సుస్థిర స్థానాన్ని భద్రపరుచుకొంది.

జానపద విజ్ఞానమంతా మౌఖిక సంప్రదాయం, జానపద సాంఘిక ఆచారాలు, వస్తు సంస్కృతి, జానపద ప్రదర్శక కళలుగా విభజింపబడింది. తెలుగు జానపద గేయానికి కృషి చేసిన వారిలో టేకుమళ్ళ కామేశ్వరరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, చింతా దీక్షితులు, హరి ఆదిశేషువు, నేదునూరి గంగాధరం, బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణకుమారి వంటివారిని ఈ సందర్భంగా స్మరించుకోవాలి. జానపద వాఙ్మయ గ్రంథాలను, పరిశోధన గ్రంథాలను దర్శించాలి. త్రివేణి, సెలయేరు,మిన్నేరు, మున్నీరు వంటి జానపద గేయాలను భద్రపరచిన గ్రంథాలను చూడాలి. ఆ గేయాల్లో నిక్షిప్తమైన తెలుగువారి జీవన విధానాన్ని గమనించాలి. జానపద సంగీతాన్ని ఆస్వాదించాలి.

జానపద దినోత్సవ సందర్భంగా అజ్ఞాత కర్తృత్వమైన జానపద సాహిత్య సృష్టికర్తలందరికీ నన్నయవాణి అక్షర నివాళి!!

– డా.తలారి వాసు

# ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**22.08.21 (మీడియాసెల్)** ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టు ప్రపోజల్స్ ను సిద్ధం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ విభాగం వారు 'సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ఎస్.టి.ఐ) హిబ్స్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ షెడ్యూల్డ్ కాస్ట్ (ఎస్సీ) అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎస్టీ) కమ్యూనిటీస్' కు సంబంధించిన ప్రతిపాదనలను కోరారు. దీనిపై శనివారం విశ్వవిద్యాలయం ఈసీ హాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ రెగ్యులర్ అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి ప్రతిపాదనలను విశ్వవిద్యాలయ అధ్యాపకులు సిద్ధం చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీల జీవనోపాధి మెరుగుదలకు సంబంధించిన సుస్థిరమైన అభివృద్ధి ప్రతిపాదనలను విశ్వవిద్యాలయం నుండి పంపించాలని తెలిపారు. నైపుణ్యం, మౌలిక సదుపాయాలు మరియు ప్రాధాన్యతా ప్రాంతాలను గుర్తించడానికి అధ్యాపకులందరూ చర్చించి వచ్చే నెల 15వ తేదీ నాటికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి అశోక్, ఈసీ మెంబర్స్, ప్రిన్సిపాల్స్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రతిపాదనలపై చర్చిస్తున్న వీసీ

# 20న జరగాల్సిన పరీక్ష 29కి వాయిదా

### పీజీ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన వీసీ

**21.08.21 (మీడియాసెల్)** ఈ నెల 20వ తేది మొహరం సెలవుగా ప్రకటించడంతో 20వ తేదీన జరగాల్సిన పరీక్షలను 29వ తేదీకి వాయిదా వేస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కోవిడ్ నిబంధనలను పాటిస్తూ పరీక్షలు వ్రాయాలని విద్యార్థులకు వీసీ సూచించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మొహర్రం సెలవును ఈ నెల 19వ తేదీకి బదులు 20వ తేదీకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. కాబట్టి 20వ తేదీన జరగాల్సిన పరీక్షలను 29వ తేదీకి వాయిదా వేస్తున్నామని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ బి.ఎ., బి.కామ్, బి.ఎస్సీ, బి.బి.ఎ., బి.సి.ఎ., ఒకేషనల్ కోర్సులు, పీజీ ఎం.ఎ.,ఎం.బి.ఎ., ఎం.ఎడ్, బి.టెక్ కోర్సులకు పరీక్షలు జరుగుతున్నాయని అన్నారు. ముందుగా ప్రకటించిన టైం టేబుల్ ప్రకారం మిగిలిన పరీక్షలు జరుగుతాయని 20వ తేది పరీక్షను మాత్రం సెలవు కారణంగా29వ తేదికి వాయిదా వేశామని చెప్పారు. ప్రస్తుతం నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయని తెలిపారు. కోవిడ్ నిబంధనలను కట్టుదిట్టంగా పాటిస్తూ పరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. యూనివర్సిటీ ప్రాంగణంలో శానిటేజేషన్లను ఏర్పాటు చేశామని, మాస్కులు ధరించి భౌతిక దూరం పాటిస్తూ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. విద్యార్థులంతా కోవిడ్ పట్ల ప్రత్యేక జాగ్రతలు వహిస్తూ మిగిలిన పరీక్షలను సమర్థవంతంగా వ్రాయాలని సూచించారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకు సూచనలిస్తున్న వీసీ

# సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలను పరిశీలించిన వీసీ

**22.08.21 (మీడియా సెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలను ఆచార్య మొక్కా జగన్నాథరావు శనివారం ఆకస్మిక తనిఖీ చేసారు. సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల లోని అన్ని విభాగాలను పరిశీలించారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ కార్యాలయంలో హాజరు పట్టీలను పరిశీలించి అధ్యాపకుల హాజరు వివరాలపై ఆరా తీశారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది క్రమశిక్షణగా సమయానికి హాజరై సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.



సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యాలయాలను పరిశీలించిన వీసీ


## మంచి మాట

జీవితంలో తారసపడే ప్రతి ఒక్కరూ మనకు గురువులే. మంచివాళ్ళు పాఠం నేర్పుతారు. చెడ్డవాళ్ళు గుణపాఠం నేర్పుతారు.




## ప్రతిభా వాణి

# క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ శామ్యూల్ హానిమాన్



హానిమాన్ 1775 వ సం. ఏప్రిల్ 10 వ తేదీన జర్మనీలోని మిస్సెల్ అను కుగ్రామంలో జన్మించాడు. నిరుపేద కుటుంబం. తండ్రి పింగాణీ పాత్రలపై రంగులు వేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు 10 మంది సంతానం. బాల్యదశలోనే హానిమాన్ అసాధారణ ప్రతిభ కలవాడు. విద్యార్థి దశ నుండి వినయం, శ్రద్ధ, పట్టుదల మొదలగు సద్గుణాలు కలిగి ఉపాధ్యాయుల మన్నన పొందాడు. కాని హానిమాన్‌కు స్కూల్ ఫీజు కట్టలేక అతని తండ్రి స్కూల్ మానిపించాడు. కాని ఆయన ఉపాధ్యాయుడు హానిమాన్ ప్రతిభ చూసి ఫీజు లేకుండా చదువుకొనే ఏర్పాటు చేశాడు. అప్పటికీ కుటుంబం గడవడం కష్టమై విద్యార్థులకు పాఠాలు చెప్పి, ఇతర భాషలలో ఉన్న గ్రంథాలు తర్జుమా చేసి వచ్చిన డబ్బుతో కుటుంబానికి ఆర్థిక భారం లేకుండా జీవించేవాడు.

ఆయన తన 24వ ఏట 1779లో వైద్యశాస్త్రంలో ఎం.బి.బి.ఎస్. పట్టా పుచ్చుకున్నాడు. 1782లో నవంబర్ 17వ తేదీన హెన్‌రియట్ ను వివాహం చేసుకున్నాడు. హానిమాన్ వైద్యవృత్తిలో (అల్లోపతి) దాదాపు 10 సంవత్సరాలపాటు వివిధ పట్టణాలలో వైద్యం చేశాడు. ఆయన ప్రావీణ్యత గల వైద్యుడేగాక, గొప్ప శాస్త్రవేత్తగా కూడా పేరు ప్రఖ్యాతులు పొందాడు. చిన్న వయస్సులోనే డెస్టెన్ హాస్పిటల్‌లో ప్రధాన శస్త్ర చికిత్స అధికారి అయ్యాడు. కొంతకాలానికి తాను చేస్తున్న వైద్య విధానంలో లోపాలను గమనించి, దీర్ఘవ్యాధులు నివారణ కాకపోవడం, పదేపదే వ్యాధులు తిరగబెట్టడం నచ్చక వైద్యవృత్తిని విడిచిపెట్టాడు.

వైద్యవృత్తి మానివేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు లేకుండుటకు, సంసారాన్ని పోషించుకొనేందుకు ఎన్నో గ్రంథాలను తర్జుమా చేశాడు. ఆయనకు ఇంగ్లీష్, ఇటలీ, ఫ్రెంచ్, గ్రీకు, లాటిన్, అరబిక్ భాషలలో ప్రావీణ్యం ఉంది. ఎందరో సైంటిఫిక్ పబ్లిషర్స్ ఆయన రచనలు, అనువాద గ్రంథాల కోసం ఎదురుచూసేవారు.

1790 లో డా.కల్లెన్‌చే వ్రాయబడిన మెటీరియా మెడికా తర్జుమా చేస్తూన్న సమయంలో అనుకోకుండా హోమియో వైద్య ముఖ్య సూత్రాలను కనుగొన్నాడు. సింకోనా అనే మందు గురించి డా.కల్లెన్ రాసిన వ్యాఖ్యానం ఆయనకు నచ్చలేదు. సింకోనా మందు తీసుకొన్నట్లయితే ఆ మందు చలిజ్వరాల నివారణ విషయం తెలుస్తుందని కొన్ని రోజులు సింకోనా మందును ముడిరూపంలో తానే స్వయంగా తీసుకొన్నాడు. ఇలా తీసుకున్న తర్వాత ఆయనలో చలి జ్వర లక్షణాలు కనిపించాయి. అదే లక్షణాలున్న రోగికి సింకోనా ఇవ్వడం వలన వ్యాధి నివారణ కలిగింది. విప్లవాత్మకమైన ఈ ప్రయోగం చికిత్సా రంగాన్ని మొత్తం ప్రక్షాళన చేసింది. ఈ విధంగా ఆయన మీద ఆయన శిష్యుల మీద కుటుంబ సభ్యుల మీద వివిధ మందులను 40 సంవత్సరాలు ప్రయోగించి వాటి వలన కలుగు లక్షణాలు క్రోడీకరించి మెటీరియా మెడికా ప్యూరా అనే గ్రంథాన్ని రాశాడు. ఈ విధంగా అనేక సంవత్సరాలు రాత్రింబవళ్లు అకుంఠిత దీక్షతో నిర్విరామ కృషి ఫలితంగా హోమియో వైద్యం ఆవిర్భవించింది.


ఈ నూతన వైద్య విద్యా విధానాన్ని ధృవపరచుటకు, నిలబెట్టుటకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇతర వైద్యులు ఈ విధానాన్ని ఆధారరహితంగా ఉన్నదని విమర్శించారు. వారి చర్యల వలన ఒక పట్టణం నుంచి మరో పట్టణానికి మారాల్సి వచ్చింది. ఈ నూతన విధానం వలన జర్మనీ దేశంలోని మందుల కంపెనీలకు నష్టం వాటిల్లటంతో వారు ఆయనను లీఫ్జిగ్ పట్టణం నుండి వెళ్లగొట్టారు. తర్వాత కోథెన్ అను పట్టణం చేరి డ్యూక్ ఫ్రెడ్రిక్ సహాయంతో తన వైద్య విధానాన్ని ప్రారంభించాడు. ఆయన కీర్తి నలుదిశలా వ్యాపించింది. దీర్ఘవ్యాధుల నిజ స్వరూపం తెలుసుకొనేందుకు ఆయనకు 12 ఏళ్లు పట్టింది. అనేక దీర్ఘకాల వ్యాధుల వారు ఆయన చికిత్సచే బాగుపడ్డారు.

1830 సంవత్సరంలో ఆయన భార్య మరణించింది. ఆయనకు ఇద్దరు కుమారులు, 9 మంది కుమార్తెలు. 1835న మెలనీడి హెర్విల్లీ అనే 36 సంవత్సరాల విద్యావంతురాలు ఆయన ప్రతిభకు ఆకర్షింపబడి వివాహం చేసుకొంది. ఆమె పలుకుబడి వలన ఫ్రాన్స్ దేశ ముఖ్య పట్టణమైన పారిస్ నగరంలో వైద్యం చేసేందుకు ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. వృద్ధాప్యంలో ఆయనకు ఆమెయే రోగులకు మందులిస్తూ సహాయపడింది. తన 88వ ఏట 2.7.1843న ఆ మహనీయుడు దేహాన్ని చాలించాడు. ఆయనను తరిమికొట్టిన లీఫ్జిగ్ ప్రజలు ఆయన మరణానంతరం 20 సంవత్సరాల తర్వాత ఆయన శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించారు.


## కోవిడ్ నిబంధనల్లో... పెళ్లి వేడుకలు


విశ్వవిద్యాలయ ఆచార్య బృందం



కాకినాడ ఎమ్.ఎస్.ఎన్ కాంపస్ అధికారులు,ఉద్యోగులు


నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్



విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల అసోసియేషన్ సభ్యులు



ఆదిత్య విద్యా సంస్థలు ఛైర్మన్ డా.ఎన్. శేషారెడ్డి


విశ్వవిద్యాలయ విద్యా కళాశాల సభ్యులు


నన్నయవాణి సంపాదక మండలి

## ప్రతిష్టాత్మక అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ (APA) 2021




**22.08.21 (మీడియా సెల్)** *ఇంటర్నేషనల్ వర్చ్యువల్ కన్వెన్షన్ లో ప్రముఖ క్రీడా పరిశోధకులు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్పృహ సైకాలజీ అలుమిని అసోసియేషన్ అధ్యక్షులు, సుంకర నాగేంద్ర కిషోర్ 12 నుండి 15 ఆగష్టు వరకు అటెండీగా పాల్గొన్నారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, పెర్ఫార్మన్స్ సైకాలజీ, హెల్త్ సైకాలజీ, స్పోర్ట్స్ సైకాలజీ, ఏతికల్ వాల్యూస్ మొదలైన పలు అంశాలు పై చర్చలలో పాల్గొన్నారు. మానవాళికి ఉపయుక్తంగా అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సదస్సుకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ మొక్కా జగన్నాథరావు తమ శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. నాగేంద్ర కిషోర్ గౌరవ పూర్వకంగా వైస్ ఛాన్సలర్ కి సవివరంగా విశదీకరించారు. నన్నయ విశ్వవిద్యాలయం తరపున ఈ సదస్సులో ఎంతో ఉత్సాహం, ఏకగ్రత, స్థిర చిత్తంతో పాల్గొనటమే కాకుండా, విశ్వవిద్యాలయానికి, మంచి పేరు తెచ్చినందుకు అభినందనలు తెలియజేశారు. సదస్సు ప్రతిపాదనలు, వివరాలు అందరితో పాలు పంచుకోవాలని సూచించారు. గతంలో నాగేంద్ర కిషోర్ న్యూఢిల్లీలో 2016, 17 లలో జరిగిన అంతర్జాతీయ స్పోర్ట్స్ కాన్ఫరెన్స్ లలో పేపర్స్ , 2019లో చికాగోలో జరిగిన సైకో కాంగ్రెస్ 2019 సదస్సులో, చికాగోలో 2019 కమ్యూనిటీ సైకాలజీ ద్వై వార్షిక సదస్సులలో నన్నయ విశ్వవిద్యాలయం స్పృహ తరపున పాల్గొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.అశోక్, ప్రిన్సిపాల్ టేకి, సైకాలజీ కోర్స్ కోఆర్డినేటర్ డా:పి. రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.నారాయణ నక్కిన,డా.భవాని తమ అభినందనలు తెలియజేశారు.*

## ఒకరికొకరు రక్ష !



అన్నా చెల్లెళ్ల అనుబంధం అభిమానానికి నిలయం!
ఒక కొలనులో విరిసిన కలువలు
ఒక చేతిలో పెరిగిన మొలకలు
రూపాలు వేరైనా భావాలు ఒక్కటే
ఓకే రక్తం... ఓకే చిత్తం.
చెల్లి కంటిలో కదిలే రూపం అన్న
అన్న గుండెలో వెలిగే దీపం చెల్లి!
చెల్లి వదనాన విరిసిన నవ్వుల పువ్వులే...
అన్న సదనాన వెలుగును రవ్వల దివ్వెలై...
అన్న అండ చెల్లి ఆశలు నెరవేర్చు బంగారు కొండ!
అన్న దండ చెల్లి రక్షణకు నిలిచిన జెండా!!
చెల్లి మనుగడకు ఏడుగడ అన్న బతుకులో జీవం చెల్లి
అన్న మురిపాలలో తేలి
అల్లారుముద్దుగా..
అన్నా.....యని నోరారగా పిలుచుటే వరముగా.....
మమకారం అనే అమృతవాహినికి ఇరు తీరాలు అన్నా- చెల్లెళ్ళు!!

అన్నా చెల్లెళ్ల అనుబంధం అభిమానానికి నిలయం!
ఆత్మీయతకే రూపం మమతానురాగాల సారం!
అదే రాఖీ పూర్ణిమ సారాంశం!!

– ఏ.జె.ఎస్.దీప్తి,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

# కోవిడ్ నిబంధనల్లో..

# పెళ్లి వేడుకలు



“ ఒక యువజంట ఏ అరుంధతీ నక్షత్ర లోకంలోనో అడుగుపెడుతుంది....

కాలం వాళ్లకోసం వసంత ఋతువును ఎదురు పంపిస్తుంది. పిట్టలు రోజంతా వేకువే అయినట్టు సందడి చేస్తాయి.... గాలి గమ్మత్తుగా మత్తుగా పరిమళ భరితమై వీస్తుంది. ఒక ప్రత్యేక స్నేహ బంధానికి చిహ్నంగా... మంగళ సూత్రం తళుక్కుమంటుంది. సుదీర్ఘ సహ ప్రయాణ సంకేతంగా సప్తపది సంచలిస్తుంది. నాగరికత మురిసిపోయి ఆనంద బాష్పాలను అక్షతలుగా కురుస్తుంది. ప్రపంచం మనని కాసేపు కాస్త ఎడం చేసి, వాళ్ళ చుట్టూ కనిపించని తెరసెల్లా కడుతుంది. సృష్టి ఆ కుటీరానికి వాకిలి చిమ్మి ముగ్గులు పెడుతుంది “

పెళ్లి గురించి ప్రముఖ గజల్ కవి శ్రీ రెంటాల గారు రాసిన మాటలివి....

అవును.... చిరంజీవులు సాయి వాత్సల్య - జనని వివాహం ఆగస్టు 11 న విశాఖలో బంధుమిత్రుల నడుమ పెళ్లి వేడుక....


ఆగస్టు 15 న రాజమహేంద్రవరంలో ఉభయ గోదావరి జిల్లాల కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సి పాల్స్, ప్రముఖుల నడుమ రిసెప్షన్....

ఆగస్టు 16న విశ్వవిద్యాలయంలో అధ్యాపక - అధ్యాపకేతర సిబ్బంది నడుమ పెళ్లి కానుక.....

బంధుమిత్రులు, ప్రము ఖులు, విశ్వవిద్యాలయ ఉద్యోగుల నడుమ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు, శ్రీమతి డా.శాంతిప్రియ దంపతుల కుమారుడు సాయివాత్సల్య వివాహ మహొత్సవం!!

కోవిడ్ నిబంధనల దృష్ట్యా ఎక్కువమంది ఒకచోట హాజరవటానికి లేదుకానీ అనుకున్న వారినందరినీ పిలిచి ఆనందంగా జరుపుకునే మార్గమిదని మాత్రం ఉపకులపతి ఋజువుచేశారు.

ఆత్మీయులందరి
రాకతో
వేడుకలు



వి.సి. కుటుంబ సభ్యులు

ఉదాత్తతని సంతరించుకున్నాయి. కోవిడ్ నిబంధనలు కొత్త ఆలోచనల్ని, అందాన్ని తీసుకొచ్చాయి.అతిథులందరూ హాజరయ్యే కొత్త పద్ధతి మార్గదర్శకంగా నిలిచింది.

చిరంజీవి సాయి వాత్సల్య ఐ.ఐ.టి. గౌహతిలోను ఐ.ఐ.ఎమ్.అహ్మదాబాద్ లో చదువు కున్నారు. ఐ.ఐ.ఎమ్. పర్సనైల్ లో టాప్ 10 లో ఉన్న విద్యార్థి. చిరంజీవి జనని కూడా ఐ.ఐ.ఎమ్.లో మెరిట్ స్టూడెంట్.

ఆచార్య మొక్కా జగన్నాథరావు తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడుతూ ఆస్తులు, సంపాదన ప్రధానం కాదు. చదువు గొప్పది. దానిని సాధించటమే, సముపార్జించటమే ముఖ్యమని అంటారు. దానికి ఆయన చూపిన ఆచరణ సివిల్స్‌కి ఎంపికై కూడా బోధన, పరిశోధనల పట్ల మక్కువతో ఆచార్యునిగా సేవలందించి ఉపకులపతిగా ఎదగటం, భార్య శ్రీమతి డాక్టర్ శాంతి ప్రియ ఎమ్.డి. పాథాలజీ వైద్య సేవలందించడం, పాప చిరంజీవి డాక్టర్ నాగ సంప్రీతి ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎం.బి.బి.ఎస్ పూర్తి చేయటం.... నా పిల్లల చదువులే నా ఆస్తి అంటారాయన. చదువుల ఔన్నత్యానికి ఆయన చూపిన ఆచరణ అందరికీ ఆదర్శప్రాయమైన మార్గం.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ దంపతులకు, కుటుంబానికి, నవ దంపతులకు నన్నయవాణి శుభాకాంక్షలను అందిస్తోంది.

\- సంపాదక మండలి



ఏ.పి. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి



ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ప్రసాదరెడ్డి



ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్



అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సత్యవతి



పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ రామ్



శాసన సభ్యులు శ్రీ జక్కంపూడి రాజా

## కృతజ్ఞతలు

మా అబ్బాయి వివాహ వేడుక మీ అందరి
రాకతో ఆత్మీయ మందిరంగా మారిపోయింది.
మామూలు క్షణాలు మీ అభిమాన స్పందనల్ని
నింపుకుని పండుగగా తర్జుమా అయ్యాయి.
అందరికీ మరొక్కమారు మా కుటుంబం తరపున,
విశ్వవిద్యాలయం తరపున
కృతజ్ఞతాభివాదాలు!!

\- ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి,
ఆదికవి నన్నయ
విశ్వవిద్యాలయం.

